సాక్షి ఖమ్మం
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



ఇసుకాసురుల కట్టడి
జిల్లాలో ఇసుక రవాణాపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 8లో



ఏళ్ల నాటి కల నెరవేరింది..
అయోధ్యలో రామమందిరం నిర్మాణంతో దేశ ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరిందని బీజేపీ నాయకులు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 19°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం చలిగాలుల ప్రభావం ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



శ్రీవారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు తెల్లవారు జామున గర్భగుడిలో మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

79 మంది నర్సింగ్ ఆఫీసర్లు రిలీవ్
ఖమ్మం వైద్యవిభాగం: వైద్య విధాన పరిషత్‌కు చెందిన 79 మంది నర్సింగ్ ఆఫీసర్లను అధికారులు రిలీవ్ చేశారు. ఇటీవల నియామకాల్లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 325 మంది నర్సింగ్ ఆఫీసర్లను కేటాయించారు. దీంతో ఇన్నాళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న 79 మందిని వైద్య విధాన పరిషత్‌కు పంపించారు. వీరు హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పాల్గొనగా.. జిల్లా, జోనల్ ప్రాతిపదికగా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు కేటాయించారు.

ప్రశాంతంగా 'నవోదయ' ప్రవేశపరీక్ష
కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 9వ తరగతిలో ప్రవేశానికి 746 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 541 మంది, 11వ తరగతిలో ప్రవేశానికి 1,289 మంది దరఖాస్తు చేసుకోగా 1,042 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

ఐదుగురు సీఐల బదిలీ
ఖమ్మంక్రైం: జిల్లాలో ఐదుగురు సీఐలు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న మోహన్ బాబును ఖమ్మం ట్రాఫిక్‌కు, ట్రాఫిక్ సీఐగా అశోక్ వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న నూనె వెంకటేశ్వర్లను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అలాగే, వీఆర్‌లో ఉన్న హనూక్‌ను స్పెషల్ బ్రాంచ్–2కు, స్పెషల్ బ్రాంచ్–2 సీఐ శ్రీధర్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

తహసీల్దార్ల బదిలీలు
ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం తహసీల్దార్ల బదిలీలు జరగగా.. జిల్లాలోనూ పలువురికి స్థానచలనం కలిగింది. ఈమేరకు ఇతర ప్రాంతాల నుంచి తహసీల్దార్లను జిల్లాకు కేటాయించగా, జిల్లా నుంచి పలువురిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వీరికి త్వరలోనే పోస్టింగ్ ఇవ్వనున్నారు. కాగా, వెయిటింగ్‌లో ఉన్న ఎం.శైలజ, ఖమ్మం ఆర్డీఓ కార్యాలయం డీఏఓ ఎస్.శ్వేతను మహబూబాబాద్ జిల్లాకు, కల్లూరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓ కె.శ్రీనివాసరావును భద్రాద్రి జిల్లాకు కేటాయించారు. ఇక హనుమకొండ కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న టి.గౌరీశంకర్‌ను ఖమ్మం జిల్లాకు కేటాయించారు. అలాగే, నేలకొండపల్లి తహసీల్దార్ పి.అనురాధబాయిని సైతం బదిలీ చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డీఈఓ, తదితరులు

రఘునాథపాలెం: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన రఘునాథపాలెంలోని తెలంగాణ మైనార్టీ గురుకులంలో శనివారం జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చది వితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీష్, ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ ఎనుముల వెంకటేశ్వర్లు, టీఎస్ కాస్ట్ అధికారి వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో విద్యార్థులు కె.సహస్ర, ఈ.మౌనిక, అక్షయరేఖ ప్రతిభ కనబర్చగా ఈనెల 28న బహుమతులు అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ ఆర్.స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెంపుల్.. టూరిజం!





ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఓ వైపు.. సంక్షేమం కొనసాగింపుపై ప్రత్యేక దృష్టి ఇంకో వైపు.. నీటిపారుదల, వ్యవసాయ, పురపాలక, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత వంటి అంశాలతో డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి బడ్జెట్ ప్రవేశపెట్టే తొలి అవకాశం భట్టికే దక్కింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని భద్రాద్రి రామాలయం, ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం, నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రాల అభివృద్ధిని బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. వీటి అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంపై దృష్టి సారించనున్నట్లు ప్రకటించగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు చేసే జిల్లా రైతులకు లబ్ధి చేకూరనుంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

రాష్ట్ర బడ్జెట్‌లో జమలాపురం ఆలయ అభివృద్ధి ప్రస్తావన
- పర్యాటక క్షేత్రంగా నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రం
- నీటి పారుదల శాఖ, మున్సిపాలిటీలకు రానున్న నిధులు
- వ్యవసాయ రంగానికి నిధులతో ఆయిల్‌పామ్ రైతులకు లబ్ధి
- జిల్లా నుంచి తొలిసారి 'భట్టి'కి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం



పర్యాటకం, ఆలయాలకు హంగులు
బడ్జెట్‌లో ప్రధానంగా భద్రాచలం రామాలయం, ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వేంకటేశ్వరాలయం, నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేయనున్నట్లు ప్రస్తావించారు. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సమీప ప్రాంతాల్లో పర్యాటకంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అలాగే, నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. దేశవిదేశాల నుంచి బౌద్ధ మతస్తులు ఈ క్షేత్రానికి వస్తున్నారు. అలాగే, చిన్న తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో ప్రస్తావించడంతో భారీగా నిధులు విడుదలవుతాయని భావిస్తున్నారు.



నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం

బడ్జెట్‌పై ఎవరేం అన్నారంటే.. 8,9లో

గ్రామాలకు వెన్నుదన్ను
నిధుల కేటాయింపు ప్రకారం ఈ బడ్జెట్ గ్రామీణ ప్రాంతాలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. గ్రామం యూనిట్‌గా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్న మంత్రి సకాలంలో నిధులు విడుదల చేస్తామని ప్రకటించడంతో జిల్లాలోని 584 గ్రామపంచాయతీల్లో అభివృద్ధి వేగం పుంజుకోనుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు ప్రత్యేకంగా రూ.40,080 కోట్లు కేటాయించడంతో జనాభా దామాషా ప్రకారం జిల్లాలోని పంచాయతీలకు నిధులు దక్కనున్నాయి.

పురపాలికలకు పెద్దపీట
జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.11 వేల కోట్ల పైచిలుకు నిధులు పురపాలక శాఖకు కేటాయించడంతో జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయడమే కాక కొత్తగా పనులు చేపట్టనున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో విలీన గ్రామాల పరిస్థితి అధ్వానంగా ఉండగా.. బడ్జెట్‌లో పేర్కొన్నట్లు విలీన గ్రామాల అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించే అవకాశముంది. తద్వారా డ్రెయినేజీలు, రోడ్లు, వైద్య సౌకర్యాల కల్పన మెరుగవుతుంది.

ఆయిల్‌పామ్ బౌల్‌గా..
రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఆయిల్‌పామ్ ఎక్కువగా సాగవుతోంది. ఇక్కడ 82 వేల ఎకరాల్లో పంట సాగుచేస్తుండగా.. గతంలోనే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు నిర్మించారు. అయితే పెరుగుతున్న సాగుకు అనుగుణంగా కొత్తగా ఫ్యాక్టరీల నిర్మాణం సైతం జరుగుతోంది. ప్రభుత్వ భాగస్వామ్యంతో అశ్వారావుపేటలో, ప్రైవేట్ భాగస్వామ్యంతో కొణిజర్లలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు నిర్మిస్తుండగా ఇవి అందుబాటులోకి వస్తే రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులు ఆయిల్‌పామ్ సాగుకు అందనుండడంతో ఉమ్మడి జిల్లా ఆయిల్‌పామ్ బౌల్‌గా మారనుంది.

రుణమాఫీపై ప్రత్యేక దృష్టి
ఇప్పటి వరకు జిల్లాలో రూ.లక్షలోపు రుణానికి సంబంధించి 1,11,692 మంది రైతులకు రూ.510.63 కోట్లు మాఫీ అయింది. ఇంకా రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వీటితోపాటు కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాల్సి ఉంటుంది. ఈ అంశంపై కసరత్తు చేస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడంతో జిల్లా రైతులకు లబ్ధి కలగనుంది. అలాగే జిల్లాలోని 2.56 లక్షల మంది రైతులకు వచ్చే ఏడాది నుంచి ఏటా రెండు సీజన్లలో రూ.15వేల చొప్పున రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందనుంది.

గ్యారంటీగా అమలు
ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించగా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచింది. మిగిలిన గ్యారంటీల అమలును బడ్జెట్‌లో ప్రస్తావించారు. ప్రజాపాలన సభల్లో 5,49,862 దరఖాస్తులు అందాయి. ఇందులో ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, ఇంటి నిర్మాణానికి సాయం కోసమే ఎక్కువ దరఖాస్తులు ఉన్నాయి. బడ్జెట్‌లో ప్రకటనతో వీరిలో అర్హులకు లబ్ధి జరగనుంది.

పైలట్‌గా పబ్లిక్ స్కూల్..
విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతీ మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మించనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందుకోసం పైలట్‌గా జిల్లా కేంద్రానికి దూరాన మండలాలను ఎంచుకుంటామని చెప్పారు. దీంతో జిల్లాలోని పలు మండలాలకు అవకావం దక్కనుండగా.. మెగా డీఎస్సీ ప్రకటనతో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులను కలలు నెరవేరనున్నాయి.

సాగునీటి రంగానికి నిధులు
జిల్లాలో పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి, జాలిముడి రిజర్వాయర్లు చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టులుగా ఉన్నాయి. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న ఈ ప్రాజెక్టులకు నిధులు రానున్నాయి. బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల రంగానికి రూ.28వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ లెక్కన రిజర్వాయర్లను మరింతగా ఆధునికీకరించేందుకు నిధులు వెచ్చించనున్నారు.

బడ్జెట్‌లో సమతుల్యత



గుణాత్మకమైన ఆర్థికావృద్ధి సాధనకు ఓటాన్ అకౌంట్ ఉపయోగంగా ఉంటుంది. మౌలిక రంగాలైన విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కేటాయింపులు మెరుగ్గా ఉన్నాయి. బడ్జెట్‌లో పలు రంగాలకు సమతుల్యంగా నిధులు కేటాయించారు.
– డాక్టర్ ఎస్.గోపి, ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల

విద్యాశాఖకు కేటాయింపు హర్షణీయం



ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,389 కోట్లు కేటాయించడం హర్షణీయం. ప్రత్యేకంగా తెలంగాణ పబ్లిక్‌స్కూల్‌కు రూ.500కోట్లు, యూనివర్సిటీలకు రూ.500 కోట్లు, బీసీ గురుకుల భవన నిర్మాణాలకు నిధులు కేటాయించింది.
– ఎర్రమల్ల శ్రీనివాసరావు, ఉద్యోగి

గ్యారంటీలు అమలైతే ఉపయోగం



ఆరు గ్యారంటీలు అమలైతే ప్రజలకు ఉపయోగం. ఇప్పటికే మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారు. ఇతర గ్యారంటీలను కూడా వీలైనంత త్వరగా అమలు చేయనున్నట్లు నిధుల కేటాయింపుతో తెలుస్తోంది.
– బజ్జూరి ఇందిర, మోతీనగర్, ఖమ్మం

పొరపాట్లు లేకుండా సర్వే పూర్తి చేయండి



సర్వే వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం అర్బన్: మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కు సిలిండర్ అందజేసేందుకు చేపట్టిన సర్వేను పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని వైఎస్సార్ కాలనీలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ శనివారం పరిశీలించారు. మున్సిపల్ ఏఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

ఎర్రుపాలెం/చింతకాని: గ్యాస్ కనెక్షన్ నంబర్ల వివరాల సేకరణను త్వరగా పూర్తిచేసి తప్పులు లేకుండా నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ సూచించారు. ఎర్రుపాలెం, చింతకాని మండలాల్లో శనివారం పర్యటించిన వారు సర్వేను పరిశీలించి మాట్లాడారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం అర్హులు వివరాలు అందజేయాలని చెప్పారు. ఎంపీడీఓలు గంధం శ్రీలక్ష్మి, శ్రీనివాసరావుతో పాటు ఉద్యోగులు ఎం.శ్రీనివాసరెడ్డి, బుచ్చన్న, మహ్మద్ నిస్సార్ పాల్గొన్నారు.

నేటి నుంచి టీపీటీఎఫ్ రాష్ట్రమహాసభలు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నయాబజార్ పాఠశాల మైదానంలో ఆదివారం నుంచి రెండ్రోజుల పాటు టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలు జరగనున్నాయని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డి తెలిపారు. మైదానంలో ఏర్పాట్లను శనివారం పరిశీలించిన అనంతరం వారు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సహాధ్యక్షుడు మనోహర్ రాజుతో కలిసి మాట్లాడారు. ఏపీటీఎఫ్ ఏడున్నర దశాబ్దాలుగా విద్యావ్యాప్తి, విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడగా, తెలంగాణ ఏర్పడ్డాక టీపీటీఎఫ్‌గా మారిందని తెలిపారు. ఈనేపథ్యాన నిర్లక్ష్యానికి గురవుతున్న విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు, పాలకుల విధానాలపై చర్చించి కార్యాచరణను రాష్ట్ర మహాసభల్లో రూపొందించనున్నామని పేర్కొన్నారు. ఈమేరకు సభల్లో వివిధ అంశాలపై బుర్రా రమేష్, జి.హరగోపాల్, ఎ.నర్సింహారెడ్డి, సి.కాశీం, చందనా చక్రవర్తి, ఎస్.వేణుగోపాల్, పి.ప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు. తొలిరోజైన ఆదివారం సాయంత్రం 4గంటలకు ఖమ్మంలో ర్యాలీ నిర్వహించనుండగా, ఆతర్వాత బహిరంగ సభలో ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు ప్రసంగిస్తారన్నారు. సంఘం బాధ్యులు ముత్యాల రవీందర్, నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్, కడారి భోగేశ్వర్, సిద్దోజు కవిత, మాడుగుల రాములు, ఏ.వీ.నాగేశ్వర్ రావు, ఎస్.విజయ్ పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం పెరగాలి

- సంప్రదాయ, ఫాసిస్టు శక్తులతోనే ట్రోలింగ్
- అభ్యంతరకర శక్తులను ఎదుర్కోవాలి..
- ప్ర.ర.వే. మహాసభల్లో స్త్రీవాద రచయిత ఓల్గా



మాట్లాడుతున స్త్రీ వాద రచయిత్రి ఓల్గా, వేదికపై రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: మహిళలకు జరుగుతున్న అవమానాలపై ప్రశ్నించే తత్వం పెరగాల్సిన అవసరముందని స్త్రీవాద రచయిత ఓల్గా అన్నారు. సమాజంలో పెచ్చుమీరుతున్న అభ్యంతరకర శక్తులను ధైర్యంగా ఎదిరించాలని సూచించారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్ర.ర.వే.) ఏడో మహాసభలు ఖమ్మంలో శనివారం ప్రారంభమయ్యాయి. స్త్రీలపై ట్రోలింగ్ ప్రధానాంశంగా నిర్వహిస్తున్న ఈ సభల్లో తొలుత వేదిక జెండాను ఆవిష్కరించగా జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ వేణు, కేఎన్.మల్లీశ్వరి మాట్లాడారు. అనంతరం 'ట్రోల్' పుస్తకాన్ని ఆవిష్కరించాక ఓల్గా మాట్లాడుతూ అనాదిగా మహిళలపై వేధింపులు ఉన్నాయని, దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయి పూలేపై ప్రత్యక్ష దాడులు జరిగాయని తెలిపారు. అయినా ఆమె ధైర్యంగా ముందుకు సాగిందన్నారు. ఎందరో రచయిత్రులు సమాజంలో జరుగుతున్న ఘటనలపై పుస్తకాలు రాయగా.. రచయిత్రులపైనా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. కొందరు అవమానాలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. అయితే, వేధింపులు, అవమానాలకు భయపడకుండా ఎదురించాలని ఆమె సూచించారు. ఆతర్వాత తిరునగరి దేవకీదేవి అధ్యక్షతన జరిగిన 'ట్రోల్' పుస్తక పరిచయ కార్యక్రమంలో రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ పూర్వం నుంచి ట్రోలింగ్ సమస్య ఉండగా.. సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పెరిగిందని చెప్పారు. ప్రభుత్వాలు సైబర్ క్రైం చట్టాలను పటిష్టం చేస్తే ట్రోలింగ్‌ను కొంత మేర అరికట్టవచ్చని తెలిపారు. ఆతర్వాత జీఎస్. రామ్మోహన్, జహా ఆరా, కాత్యాయనీ విద్మహే, కొండేపూడి నిర్మల, కృష్ణకుమారి వివిధ అంశాలపై మాట్లాడగా రవిమారుత్, భూమిక సత్యవతి, దీప్తి, మలుపు బాల్‌రెడ్డి, అమర జ్యోతి, ఉరిమళ్ల సునంద, ఖలీదా పర్వీన్, షెహనాజ్ బేగం, ప్రసేన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ట్రోలింగ్ – అనుభవాలు'పై చర్చ

ప్ర.ర.వే. మహాసభల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం ట్రోలింగ్ అనుభవాలపై చర్చ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉదయభాను, సుజాత సూరేపల్లి, తులసి చందు, వనజ, ఖాలీదా పర్వీన్, మెర్సీ మార్గరెట్, శాంతి ప్రబోధ, బైరి నరేష్, వి.సంధ్య, అరుణ, గోగులమండ, దీప్తి సిర్ల, సజయ, శ్రీదేవి, స్వేచ్ఛ ప్రసంగిస్తారు. అలాగే, 'నారి సారించిన నవల' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఇక ముగింపు సభలో ఘంటా చక్రపాణి, తదితరులు పాల్గొననుండగా, వేదిక నూతన కమిటీని ఎన్నుకుంటారు.



మహాసభల్లో పాల్గొన్న రచయితలు, సాహితీవేత్తలు

క్లుప్తంగా

నేడు అండర్-15 ఫుట్‌బాల్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రభుత్వ పాఠశాలల బాల బాలికలకు అండర్-15 జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు కిలారు శ్రీరాం, బి.గోపిచంద్, కిషోర్, రమణ, మాధురి తెలిపారు. ఆదర్శ స్పోర్ట్స్ ఫౌండేషన్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని మున్సిపాల్ పార్క్‌లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలను డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించనుండగా, వివరాల కోసం 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ జేఏసీ లోగో ఆవిష్కరణ


లోగోను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ న్యూ గ్రాడ్యుయేట్ జేఏసీ లోగోను శనివారం ఖమ్మంలో ఆవిష్కరించారు.లోగోను వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ, మాజీ సైనిక ఉద్యోగి ఎస్ఎం.అరుణ్ ఆవిష్కరించి మాట్లాడారు. పట్టభద్రులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు అండగా నిలవాలని సూచించారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడిగా రాజకుమార్, భానుచందర్‌తో పాటు గోవిందరావు, నాగరాజు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంక్‌మేనేజర్ పేరిట బురిడీ

పెనుబల్లి: బంగారంపై తీసుకున్న రుణ పరిమితి తీరిందంటూ బ్యాంకు మేనేజర్ పేరిట ఫోన్ చేసిన వ్యక్తి రూ.10వేలు కాజేశాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం కోంద్రుపాడుకు ఎలమంచి వెంకటసుబ్బారావుకు శనివారం అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి బ్యాంకు మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించకపోతే బంగారం వేలం వేస్తామని చెప్పగా వెంకటసుబ్బారావు రూ.10వేలు ఫోన్‌పే చేశాడు. ఆతర్వాత అనుమానంతో నాగార్జున గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ చేయగా అబద్ధమని తేలడంతో పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

బాగుంది.. బాగాలేదు!

రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

- జనరంజకంగా ఉందన్న కాంగ్రెస్ నేతలు
- సంక్షేమం ఊసే లేదని బీఆర్ఎస్, బీజేపీ విమర్శ



రాష్ట్ర ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై నేతల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. వివిధ రంగాలకు కేటాయింపులపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, విద్యారంగానికి కేటాయించిన నిధుల విషయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతించారు. మరోపక్క బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాత్రం బడ్జెట్‌లో కొత్తదనం లేదని, ప్రాధాన్యత రంగాలను విస్మరించారని విమర్శించారు. ఈ సందర్భంగా బడ్జెట్‌పై ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

అంతా అంకెల గారడీ



బడ్జెట్‌లో అంకెలు, మాటల గారడీ మాత్రమే కనిపించింది. గత బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.26,831 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు రూ.19,746 కోట్లే కేటాయించారు. పెట్టుబడి సాయానికి కేటాయింపులే లేవు

– నామ నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ

ఇది జనరంజక బడ్జెట్



ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. ఆరు గ్యారంటీలకు అమలుకు నిధులు కేటాయించడం మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. వ్యవసాయానికి సైతం పెద్దపీట వేశారు.

– దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు

పద్దు బాగుంది.. అమలు చేయండి



ఆరు గ్యారంటీల అమలుకు రూ.63,196 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. దీనిపై కార్యాచరణ రూపొందించాలి. గత ప్రభుత్వాలు కేటాయించిన నిధులను వెచ్చించలేదు. ఈసారి అలా జరగకుండా చూడాలి.

– భాగం హేమంతరావు, సీపీఐ నాయకుడు

రైతాంగానికి నిరాశ



ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీగా మాత్రమే ఉంది. జిల్లాలో కీలకమైన సీతారామ ప్రాజెక్టును ప్రస్తావించకపోవడం రైతాంగానికి తీవ్ర నిరాశకు గురిచేసింది. కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామన్నా నిధులు కేటాయించలేదు.

– గల్లా సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

విద్యారంగానికి పెరిగిన ప్రాధాన్యత

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి గతం కంటే కేటాయింపులు పెరగటాన్ని స్వాగతిస్తున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 6.7శాతం ఉంటే ప్రస్తుతం 7.75శాతానికి పెంచారని తెలిపారు. అయితే, కేటాయింపులు పెరిగినా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా 15శాతం మాత్రం లేవని పేర్కొన్నారు. ఇక గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం, ప్రతీ మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రతిపాదించడం హర్షణీయమని తెలిపారు. కాగా, ఈ స్కూళ్లను మండలానికి ఒకటి కాకుండా జనాభా ప్రాతిపదికన అవసరమైన చోట అదనంగా ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలనే పబ్లిక్ స్కూళ్లుగా మార్చి అభివృద్ధి చేయాలని సూచించారు.

ఇక బడ్జెట్ పేదల సంక్షేమం, మధ్య తరగతి ప్రజల ఆశలు తీర్చేలా ఉందని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రజలను మభ్య పెట్టేలా ఉంది..



బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టేలా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే సమయం కేటాయించారు. వ్యవసాయానికి తక్కువ నిధులు కేటాయించడంతో వరంగల్‌లో కాంగ్రెస్ చేసిన రైతు డిక్లరేషన్ చిత్తు కాగితమేనని తేలిపోయింది.

– తాతా మధు, ఎమ్మెల్సీ

మూస ఫార్ములాతోనే..



కొత్త ప్రభుత్వం మూస పద్ధతిలోనే బడ్జెట్ రూపొందించింది. విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి 7.5 శాతమే కేటాయించారు. ఉద్యోగాల భర్తీపై స్పష్టత ఇవ్వలేదు. ఊపా లాంటి నల్ల చట్టాల రద్దు ప్రస్తావన లేదు.

– పోటు రంగారావు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి

ఇసుకాసురుల కట్టడి

సాక్షి ఎఫెక్ట్..

పాలేరులోకి వెళ్లకుండా కందకాలు


పాలేరు వాగు వద్ద గుంత తవ్విస్తున్న ఉద్యోగులు

తిరుమలాయపాలెం: అనుమతి లేకుండా జలాశయాల నుంచి ఇసుక తవ్వి తరలిస్తున్న వారిపై 'ఇసుకాసురులు' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు తిరుమలాయపాలెం మండలం ముజాహిదిపురం పరిధి పాలేరు వాగులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఆధ్వర్యాన జేసీబీతో కందకం తవ్వించారు. కాగా, అక్రమార్కులు ఎవరైనా సరే చర్యలు తప్పవని తహసీల్దార్ రాంప్రసాద్ హెచ్చరించారు. ఇక పాలేరు నుండి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు శనివారం ఉదయం వెళ్తుండగా పలువురు అడ్డగించారు. ట్రాక్టర్లను పట్టుకోవద్దంటూ గ్రామానికి చెందిన నల్లగట్టు మధు, పుల్లూరి మహేందర్, పుల్లూరి వీరయ్య, పుల్లూరి ప్రభాకర్ ఏఎస్సై రాఘవయ్య, కానిస్టేబుల్‌ని అడ్డుకోగా వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లి శివారు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న కొత్తకారాయిగూడెంకు చెందిన కూరపాటి నాగరాజు, కుప్పెనకుంట్ల శివారు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న కల్లూరు మండలం ముగ్గు వెంకటాపురానికి పిట్టల బాలాజీ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

పొక్లెయినర్ సీజ్

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెంలో శ్రీరాజ రాజేశ్వరీ, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల భూముల నుంచి మట్టి తరలిస్తుండగా, ఇప్పటికే టిప్పర్లు సీజ్ చేసిన పోలీసులు శనివారం పొక్లెయినర్‌ను సైతం సీజ్ చేశారు. కాగా, ఈ భూముల నుంచి మట్టి తరలించే క్రమంలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో అధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏళ్లనాటి కల మోదీతో నెరవేరింది..


అయోధ్య రైలును ప్రారంభిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: వందల ఏళ్లుగా అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం దేశప్రజలు ఎదురుచూస్తుండగా దేశ ప్రధాని నరేంద్రమోదీతో ఆ కల నెరవేరిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం నుండి అయోధ్యకు భక్తులతో బయలుదేరిన ప్రత్యేక రైలును శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండి ర్యాలీగా స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నుండి పెద్దసంఖ్యలో భక్తులు అయోధ్య బయలుదేరడం శుభపరిణామమన్నారు. అంతకుముందు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం గర్వకారణమని తెలిపారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు విషయమై విచారణ ఏమైందో రాష్ట్రప్రభుత్వం చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈసమావేశాల్లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు గెంటేల విద్యాసాగర్, దొంగల సత్యనారాయణ, నున్నా రవికుమార్, మందా సరస్వతి, లక్ష్మయ్య అల్లిక అంజయ్య, చావా కిరణ్, నెల్లూరి కోటేశ్వరావు, దీకొండ శ్యాం, వాసుదేవరావు, తాండ్ర వినోద్‌రావు మార్తి వీరభద్రప్రసాద్, మేకల నాగేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అయోధ్య వెళ్తున్న భక్తులకు డాక్టర్ జీవీ ఫౌండేషన్ ఫౌండర్, శ్రీరక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ గోంగుర వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన పండ్లు, టిఫిన్ అందజేశారు.

అయోధ్యకు 1,344 మంది భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: అయోధ్య బాలరాముడి దర్శనార్థం వెళ్తున్న భక్తులతో శనివారం సాయంత్రం ఖమ్మం నుంచి ప్రత్యేక రైలు బయలుదేరింది. ఈ రైలులో 1,344 మంది భక్తులు వెళ్లారు. ఒక్కొక్కరికి రూ.1,900చార్జీతో వెళ్లివచ్చేలా ఈ రైలు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా భక్తులను తనిఖీల అనంతరం రైలులోకి అనుమతించారు. అయోధ్య బయలుదేరిన వారిలో ఆమంచి సురేష్‌శర్మ, సరస్వతిభట్ల శ్రీధర్‌శర్మ, మార్తి వీరభద్రప్రసాద్‌శర్మ, దిలీప్‌శర్మ, భార్గవాచార్యులు, చిర్ర రవి, సీహెచ్.కృష్ణ, అక్బర్ పాషా, పసుమర్తి సంతోష్, మల్లం హరీష్, నాగులగాని అంజయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తి చేయాలి

టీఎస్‌ఆర్టీసీ ఈయూ మహాసభలో వక్తలు



మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు

మధిర: గత ప్రభుత్వం నిలిపివేసిన ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న కోరారు. మధిరలో శనివారం నిర్వహించిన యూనియన్ ఖమ్మం రీజియన్ రెండో మహాసభలో వారు మాట్లాడారు. కార్మికుల వేతన సవరణ చేయడంతో పాటు ఉద్యోగ భద్రతకల్పించాలని, పనిభారం తగ్గించాలని కోరారు. అలాగే, అక్రమ చార్జీషీట్లు రద్దు చేసి, డీఏలు ఇప్పించాలని, ప్రభుత్వం వాడుకున్న ఆర్టీసీ నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వీరాంజనేయులు, బెజవాడ రవిబాబు, తిమ్మినేని రామారావు, కందుల భాస్కర్, కె.అరుణకుమారి ఎం.రామచంద్రరావు, వెంకటేశ్వర్లు, షేక్ అబ్బాస్, షేక్ నాగుల్‌మీరా, పిల్లి రమేష్, పాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మూడోసారి గెలిస్తే ప్రమాదమే..

సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో భాగం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాని మోదీ నేతృత్వాన బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. సీపీఐ జిల్లా సమితి సమావేశం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ, ఏకపక్ష విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. అలాగే, జాతీయ దర్యాప్తు సంస్థల ద్వారా రాజకీయంగా గిట్టని వారిపై కక్ష సాధిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వచ్చే గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే, తెలంగాణలో అధికార, విపక్షాలు కృష్ణా జలాలపై విమర్శలు మానుకుని శాస్త్రీయ పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కాగా, ఆరు గ్యారంటీల అమలుకు రేషన్‌కార్డును తప్పనిసరి చేసినందున అర్హులందరికీ కార్డులు జారీ చేయాలని కోరారు. సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ సంరక్షణలో నెలల పాప


శిశుగృహలో ఉన్న పాప

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలోని శిశుగృహ సంరక్షణలో నెలల పాప ఉందని జిల్లా సంక్షేమ అధికారి సుమ తెలిపారు. పాపకు తల్లిదండ్రులు ముప్పై రోజుల్లోగా తగిన సాక్ష్యాధారాలతో కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. లేనిపక్షంలో అనాథగా ప్రకటించి ప్రభుత్వం నిబంధనల ప్రకారం దత్తత ఇస్తామని తెలిపారు. కాగా, దత్తత కోసం ఆసక్తి ఉన్నవారు http://cara.wcd.gov.in సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

టీజీవోస్ సభ్యత్వ నమోదు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) సభ్యత్వ నమోదును శనివారం ప్రారంభించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తెలిపారు. ఈమేరకు ఖమ్మంలోని సంఘం కార్యాలయం వద్ద పలువురు అధికారులకు సభ్యత్వం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు శేషుప్రసాద్, రమేష్, వాసిరెడ్డి శ్రీనివాస్, నయీంపాషా, కుతుంబాక శ్రీనివాసరావు, శాస్త్రి, నాగేశ్వరరావు, సతీష్‌రెడ్డి, గంటె భాస్కర్, రమణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నవీన్, శంకర్, గణేష్, విజయలక్ష్మి, శారద, మంజుల, టీఎన్జీవోస్ నాయకుడు కొణిదన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

71క్వింటాళ్ల రేషన్‌బియ్యం మాయం

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట రేషన్ దుకాణంలో 71 క్వింటాళ్ల బియ్యం మాయమైన ఘటన శనివారం వెలుగుచూసింది. గ్రామంలోని రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు తనిఖీ చేయగా ఈ విషయం బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన అధికారులు నివేదికను కలెక్టర్ అందించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ హన్నన్, ఉద్యోగులు సీహెచ్.విజయబాబు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గ్రూపు లీడర్

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ స్వయం సహాయక సంఘం గ్రూపు లీడర్ రూ.లక్షల నగదుతో ఉడాయించగా, ఏడు నెలల తర్వాత పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక అంబేద్కర్ స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రతీనెలా చెల్లించే రుణవాయిదాలను బ్యాంక్‌లో జమ చేయకుండా గ్రూపు లీడర్ కుమారి రూ.4లక్షల మేర సొంతానికి వాడుకుని ఏడు నెలల క్రితం వెళ్లిపోయింది. ఆమెకు గాలిస్తుండగా, ఏపీలోని నెల్లూరు ఉన్నట్లు తెలియడంతో పోలీసులు వెళ్లి శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసి గ్రూపు సభ్యులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.


రూ.50వేలకు రూ.7లక్షలు ఇస్తామంటూ మోసం

నేలకొండపల్లి: చెల్లించే డబ్బుకు పదింతలు అందిస్తాం.... అంటూ నమ్మించడంతో పలువురు పేదలు అప్పులు తెచ్చి కట్టగా.. నిర్వాహకులు మకాం మార్చడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ నిర్వాహకులు నేలకొండపల్లి మండలంలోని బుద్ధారం గ్రామానికి రెండున్నరేళ్ల క్రితం వచ్చారు. ఒకసారి రూ.50 వేలు చెల్లిస్తే తొమ్మిది నెలల్లోగా రూ.7 లక్షలు వస్తాయని స్థానికులను నమ్మించారు. దీంతో వంద మందికి పైగా అందినకాడికల్లా అప్పులు తెచ్చి చెల్లించారు. ఇందుకోసం గ్రామానికి చెందిన జ్యోతి, దేవసహాయం, నాగమణిని ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకోగా వీరు కూడా పలువురి డబ్బులు వసూలు చేసి సంస్థకు చెల్లించారు. కానీ గడువు తీరి రెండేళ్లు దాటినా సొమ్ము ఇవ్వకపోగా నిర్వాహకులు చిరునామా, ఫోన్‌నంబర్లు మార్చారు. దీంతో ఏజెంట్లను నిలదీయగా వారు ఫోన్ చేసినా స్పందన రాలేదు. చివరకు మోసపోయినట్లు తెలియడంతో బాధితులు నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు న్యాయం జరగకుంటే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని వాపోయారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి ఓ ప్రైవేట్ కళాశాల సమీపాన గుర్తుతెలియని వ్యక్తి(30) మృతదేహాన్ని శనివారం గుర్తించారు. సదరు వ్యక్తి ఉండగా మృతి చెంది మూడు, నాలుగు రోజులు దాటుతుండగా, కుళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యానఆయన మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి


రాంబాబు (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లికి చెందిన మామిడి రాంబాబు(56) తాళ్లమడ రైస్‌మిల్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం ఆయన రైస్‌మిల్లుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాజమండ్రి వైపు వెళ్తున్న కారు తాళ్లమడ వద్ద వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాంబాబుకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.